# అల్లావుద్దీన్ అద్భుతదీపం





పూర్వం ఒక పేద దర్జీ వుండేవాడు. అతని కొడుకు అల్లావుద్దీన్. వట్టి సోమరిపోతు. ఎవర్నీ లక్ష్యపెట్టేవాడు కాదు. రోజూ మిగతా సోమరిపోతులతో ఆడుతూ కాలక్షేపం చేసేవాడు. ఆ విషయంలో మాత్రం అతడు సోమరి కాదు. తండ్రి బెంగతో చనిపోయాడు. తల్లి రోజూ మొత్తుకునేది. అయినా అల్లావుద్దీన్ ఏమాత్రం మారలేదు.

ఒకరోజు అల్లావుద్దీన్ వీధిలో ఆడుకుంటూ వుండగా, ఆఫ్రికా మంత్రగాడు ఒకడు పలకరించాడు. అల్లావుద్దీన్ వయసు అడిగాడు. 'నువ్వు ముస్తాపా దర్జీ కొడుకువి కదూ?' అన్నాడు. 'అవును, కాని యిప్పుడు మా నాన్న లేడు!' అన్నాడు అల్లావుద్దీన్. దానితో ఆ మంత్రగాడు అల్లావుద్దీన్‌ను కౌగలించుకుని 'నేను మీ బాబాయిని. నువ్వు అచ్చు మా అన్నయ్యలాగే వున్నావు. మీ అమ్మతో చెప్పు వెళ్లు నేను వస్తున్నానని చెప్పు' అన్నాడు.

అల్లావుద్దీన్ పరుగెత్తుకుంటూ ఇంటికి వెళ్లి తల్లితో చెప్పాడు. 'మీ నాన్నకు తమ్ముడెవరూ వున్నట్టు నాకు తెలియదు. అయినా పిలుచుకురా!' అంది తల్లి.

అల్లావుద్దీన్ మంత్రగాడిని వెంటబెట్టుకుని ఇంటికి వచ్చాడు. అల్లావుద్దీన్ తల్లి మంత్రగాడిని వింతగా చూడసాగింది. 'నా గురించి మీకు తెలియదులే వదినా! నేను దేశం వదిలి దాదాపు నలభై ఏళ్ళయింది' అన్నాడు ఆమెకు సందేహం కలగకుండా. వెంటతెచ్చిన తినుబండారాలు అక్కడ వుంచాడు. అల్లావుద్దీన్ వైపు తిరిగి 'మరి నువ్వు ఏంచేస్తున్నావు? ఖాళీగా తిరుగుతున్నావా?' అని అడిగాడు. అల్లావుద్దీన్ తలవంచుకున్నాడు. 'పని చేస్తాడా, పాడా! బలాదూరుగా తిరుగుతాడు' అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది తల్లి.

'అలాగా! అయితే అల్లావుద్దీన్‌చేత నేను ఒక మంచి వ్యాపారం పెట్టిస్తాను. ఇక మీకు తిండికి ఇబ్బంది లేకుండా గడిచిపోతుంది!' అన్నాడు. అల్లావుద్దీన్ను వెంటబెట్టుకొని బజారు తీసుకెళ్లాడు. మంచి బట్టలు ఒక జత కొని ఇచ్చాడు. నగరంలోని ఎన్నో విశేషాలు చూపించాడు.

కొడుకు మంచి బట్టలు వేసుకుని దర్జాగా వుండడం చూసి తల్లి చాలా సంతోషించింది.

మరునాడు ఆ ఆఫ్రికా మంత్రగాడు అల్లావుద్దీనును వూరి దాటి తీసుకువెళ్లాడు. ఇద్దరూ చాలా దూరం నడిచారు. అల్లావుద్దీన్ బాగా అలసిపోయాడు. 'వెనక్కి వెళ్లిపోదాం బాబాయ్!' అని చెప్పాడు. కాని మంత్రగాడు అల్లావుద్దీనుకు మాయమాటలు చెప్పి చాలా దూరం నడిపించి ఒక కొండ ప్రాంతానికి తీసుకువెళ్లాడు.

'ఇక్కడ ఆగిపోదాం. నువు కొన్ని పుల్లలు ఏరుకురా! చిన్న మంట వేయాలి!' అన్నాడు మంత్రగాడు. అల్లావుద్దీను పుల్లలు తెచ్చాడు. మంత్రగాడు మంట వేసాడు. ఆ మంటలో ఏదో భస్మం వేసి కొన్ని మంత్రాలు చదివాడు. కొద్ది క్షణాలు ఆ కాస్త మేర భూమి కంపించింది. మంట మాయమయి, ఆ స్థానంలో రాతిపలక కనిపించింది. ఇదంతా చూశాక అల్లావుద్దీనుకు భయమేసి పారిపోబోయాడు. కాని మంత్రగాడు అల్లావుద్దీనును ఒక్క దెబ్బవేసి క్రిందపడేశాడు.

'ఎందుకలా పారిపోతావు? భయపడకు. నేను చెప్పినట్టు విని, చెయ్యి. నీకు గొప్ప నిధి దొరుకుతుంది!' అన్నాడు మంత్రగాడు.

నిధి అనగానే అల్లావుద్దీనుకు సంతోషం అయింది. మంత్రగాడు చెప్పిన విధంగా, తండ్రి తాతల పేర్లు తలుచుకొని ఆ రాతి పలకను ఎంతో సునాయాసంగా పైకి ఎత్తాడు – భూమిలోపలికి ఒక దారి కనిపించింది.

'ఈ దారిగుండా లోపలికెళ్ళు. లోపల విశాలమైన మూడు మందిరాలు కనిపిస్తాయి. ఆ మందిరాల్లో ఏవీ తాకకూడదు. తాకితే వెంటనే చస్తావు. అవి దాటిన తర్వాత ఒక తోట కనిపిస్తుంది. ఆ తోట చివర చిన్న గుట్ట వుంటుంది ఆ గుట్ట పై భాగంలో ఒక దీపం వుంటుంది. దానిలో నూనె పారబోసి, నాకు తెచ్చి ఇవ్వు. ఈ వుంగరం నీ చేతికి పెట్టుకో.



ఏ దెయ్యమూ నిన్నేమీ చెయ్యలేదు' అంటూ తన వుంగిరం తీసి అల్లావుద్దీను వేలికి తొడిగాడు.

మంత్రగాడు చెప్పినట్టుగానే అల్లావుద్దీన్ భూమిలోపలికి దిగి, మూడు విశాల మందిరాలు దాటుకుంటూ, తోటలోకి వచ్చాడు. తోటలో కొన్ని పళ్ళు కోసాడు. తోట చివర వున్న గుట్ట ఎక్కి దీపాన్ని చేతిలోకి తీసుకున్నాడు. అందులో వున్న నూనెను పారబోసి మళ్ళీ వెనక్కి బయలుదేరాడు 'త్వరగా ఆ దీపాన్ని నాకు ఇవ్వు!' అన్నాడు మంత్రగాడు పైనుండి. 'నేను పైకి వచ్చిన తర్వాతే ఇస్తాను!' అన్నాడు అల్లావుద్దీను. దానితో మంత్రగాడికి కోపం వచ్చి, 'అయితే అక్కడే వుండు' అంటూ, చిన్న మంట వేసి, భస్మం చల్లి, మంత్రాలు చదివాడు. రాతిపలక మూసుకుపోయింది. అల్లావుద్దీను లోపలే వుండిపోయాడు. అక్కడనుండి మంత్రగాడు వెళ్ళిపోయాడు. అల్లావుద్దీన్ చేతిలో వున్నది మామూలు దీపం కాదు. దాన్ని గురించి మంత్రగాడు కొన్ని పుస్తకాల్లో చదివాడు దానిని సంపాదించేటందుకు అమాయకుడైన అల్లావుద్దీనును ఎన్నుకున్నాడు దీపం చేతికి వచ్చిన తర్వాత అల్లావుద్దీనును చంపేద్దామని అతని ఎత్తు.

పాపం, అల్లావుద్దీన్ రెండు రోజులు అలా చీకట్లో ఏడుస్తూ వుండిపోయాడు. చివరకు చేతులు నలుపుకుంటూ దేవుణ్ణి ప్రార్థించాడు. అలా చేయడంవల్ల, అతని చేతికి వున్న వుంగరానికి రాపిడి తగిలింది వెంటనే ఒక భయంకరమైన భూతం ప్రత్యక్షమైంది. అల్లావుద్దీను భయపడ్డాడు 'నేను ఆ వుంగిరం ధరించినవాడికి దాసిను. నేను ఏంచెయ్యాలో చెప్పు!' అంది. మాంత్రికుడు మరిచి వెళ్ళిపోయిన వుంగరాన్ని చూసుకున్నాడు అల్లావుద్దీను. 'నన్ను ఇక్కణ్ణించి బయటపడెయ్యి!' అన్నాడు మరుక్షణం అల్లావుద్దీను భూమిమీద వున్నాడు. అక్కణ్ణించి ఇంటికి పరిగి వెళ్ళిపోయాడు బాగా అలసిపోయి వుండడంచేత ఇంటికి చేరగానే స్పృహలేకుండా పడిపోయాడు తల్లి సపర్యలు చేసింది 'ఈ రెండు రోజులు ఎక్కడ వున్నావు ?' అని అడిగింది. అల్లావుద్దీను స్పృహ వచ్చిన తర్వాత, జరిగినదంతా చెప్పాడు వెంట తెచ్చిన దీపం, తోటలో కోసిన పళ్ళు చూపించాడు నిజానికి అవి పళ్ళు కావు. జాతి రత్నాలు

'అమ్మా! బాగా ఆకలిగా వుంది!' అని అడిగాడు 'అయ్యో నాయనా! తినడానికి ఇంట్లో ఏమీలేదు. వడికిన నూలు కొద్దిగా వుంది. అది అమ్మివస్తాను' అంది 'ఈ దీపం అమ్మెయి. ఇంకా ఎక్కువ డబ్బు వస్తుంది' అన్నాడు అల్లావుద్దీను, దీపాన్ని తల్లి చేతికిచ్చి దీపం బాగా దుమ్ముకొట్టుకుపోయింది. 'దీన్ని తోమితే మిలమిలా మెరుస్తుంది అప్పుడు ఇంకా ఎక్కువ డబ్బుపెట్టి కొంటారు.' అనుకుని, ఆ దీపాన్ని రుద్దింది. వెంటనే ఎదురుగుండా భూతం ప్రత్యక్షమయింది. 'ఏం కావాలి ?' అని అడిగింది. భూతాన్ని చూసి, దాని మాటలు వినకుండానే మూర్ఛపోయింది తల్లి అల్లావుద్దీన్ తల్లి చేతిలోని దీపాన్ని తన చేతుల్లోకి తీసుకుని 'ముందు నాకు తినడానికి తెచ్చిపెట్టు' అన్నాడు చాలా ధైర్యంగా.

రకరకాల తినుబండారాలను వెండి కంచాలలో పెట్టుకుని తెచ్చివచ్చింది భూతం. తర్వాత మాయమయ్యింది.

తల్లి మూర్ఛనుండి తేరుకుని, ఎదురుగుండా వున్న పదార్థాలు చూసి 'ఇవన్నీ ఎక్కడివి ?' అని అడిగింది. 'ముందు తిను, తర్వాత మాట్లాడదాం' అన్నాడు అల్లావుద్దీను. ఎంతో ఆకలిగా వుండడం చేత చాలాసేపు తిన్నారు. దీపాన్ని రుద్దితే భూతం వచ్చిందనీ, ఆ భూతం ఇవి తెచ్చిపెట్టిందనీ చెప్పాడు. 'తిండి లేకపోతే పోయింది. ఆ భూతం మాత్రం మనకి వద్దు!' అంది తల్లి.

'చాల్లే వూరుకో! ఆ భూతం మనకి సహాయం చేస్తుంది. ఈ దీపంతో, ఈ ఉంగరంతో మనకి ఇక ఏ లోటూ లేకుండా గడుపుదాం!' అన్నాడు. అలా తల్లీకొడుకు చాలాకాలం తిండికి, బట్టకు లోటు లేకుండా వున్నారు.

ఒక రోజున సుల్తాన్ ఇలా ప్రకటన చేశాడు. 'రాజకుమారి నగరవీధులగుండా స్నానానికి వెళుతుంది. ఆ సమయంలో వీధుల్లో ఎవరూ తిరగరాదు. ఇళ్ళ తలుపులు తెరవకూడదు.'

అల్లావుద్దీనుకు రాజకుమారిని చూడాలన్న కోరిక కలిగింది. ఆమె స్నానం చేసే ప్రదేశంలో దాక్కున్నాడు. ఆమె ముసుగు తీసింది. ఆమె అందం చూసి, 'చేసుకుంటే ఈమెనే చేసుకోవాలి' అనుకున్నాడు. వెంటనే తల్లితో తను రాజకుమారిని చేసుకుంటానని చెప్పాడు. ఆమె లేకపోతే బ్రతకలేనన్నాడు కొడుకు పోరు భరించలేక తల్లి సుల్తాను దగ్గరకు బయలుదేరింది. వెళ్ళేటప్పుడు అల్లావుద్దీను తోటలో కోసి తెచ్చిన పళ్ళను మూటగట్టి తీసుకువెళ్ళింది.

సుల్తాను సభ తీర్చివున్నాడు. అల్లావుద్దీను తల్లికి సుల్తానుతో మాట్లాడే అవకాశం రాలేదు. అలా ఆరు రోజులు జరిగింది. సుల్తాను రోజూ ఈమెను గమనిస్తూనేవున్నాడు. సుల్తాను వజీరుతో 'ఆరు రోజులుగా ఒకామెను సభలో చూస్తున్నాను. ఆమె గుడ్డలో మూటగట్టి ఏదో తెస్తున్నది. రేపు ముందు ఆమెను నా దగ్గరకు ప్రవేశపెట్టు' అన్నాడు.

ఏడవ రోజున అల్లావుద్దీన్ తల్లికి సుల్తానుతో మాట్లాడే అవకాశం కలిగింది. మోకాళ్ళమీద కూర్చుని సుల్తానుకు వందనం చేసింది. 'లే! నీ కోరిక ఏమిటో చెప్పు!' అన్నాడు. కానీ ఆమెకు చెప్పడానికి ధైర్యం చాలలేదు. సుల్తాను ఆమె భయం గమనించి 'నేను నిన్నేమి అనను. నీ కోరిక ఎటువంటిదయినా, నాకు చెప్పు' అన్నాడు.

'నా కుమారుడు అల్లావుద్దీన్ తమ కుమార్తెను ప్రేమించాడు. ఆమెను తప్ప ఎవర్నీ పెళ్ళిచేసుకోనని అంటున్నాడు. ఆమెను మర్చిపొమ్మని చెప్పినా వినడంలేదు నేను గనక తమరిని ఈ విషయం అడగకపోతే, ఏదైనా అఘాయిత్యం చేసేటట్టు వున్నాడు. ఏలినవారు నన్నూ నా కుమారుణ్ని రక్షించాలి!' అని వేడుకుంది తల్లి.

'నువ్వు తెచ్చిన మూటలో ఏముంది ?' అడిగాడు సుల్తాను నెమ్మదిగా ఆమె మూట విప్పి పళ్ళను చూపించింది. సుల్తానుకు సమర్పించింది అవి చూసి సుల్తాను విస్తుపోయాడు. వజీరుతో మెల్లగా అన్నాడు 'ఇటువంటి రత్నాలు నేనెప్పుడు చూడలేదు ఒక రత్నం తీసుకుని అయినా, నా కూతురిని అతనికిచ్చి పెళ్ళి చెయ్యవచ్చు!'



దానికి వజీరు 'మూడుమాసాలు ఆగమనండి. ఇంతకంటే గొప్ప బహుమతి ఇచ్చి అతడు తల్లిని పంపిస్తాడు' అన్నాడు మెల్లగా నిజానికి రాజకుమార్తెను, తన కోడలిగా చేసుకుందామని వజీరు కోరిక.

'నా కూతుర్ని నీ కుమారుడికి ఇవ్వడానికి ఒప్పుకున్నాను. కానీ మూడునెలలు ఆగి కనిపించు' అంటూ పంపేశాడు సుల్తాన్ ఆమెను.

తల్లి అల్లావుద్దీనుతో జరిగింది చెప్పింది. రెండునెలలు గడిచాయి. ఒకరోజున వీధుల్లో అందరూ సంతోషంగా వున్నారు సంబరాలు చేసుకుంటున్నారు. అల్లావుద్దీను తల్లి ఒకడిని అడిగింది, సంగతేమిటని. 'అయ్యో! నీకింకా తెలియదా ? వజీరు కొడుక్కి రాజకుమార్తెను ఇచ్చి పెళ్ళి చేయబోతున్నారు' అన్నాడు. ఆమె పరుగున వెళ్ళి కొడుకుతో చెప్పింది. అల్లావుద్దీను చాలాసేపు విచారించాడు. ఆ సమయంలో అతనికి దీపం విషయం గుర్తుకువచ్చింది. దాన్ని రుద్దాడు. భూతం ప్రత్యక్షమయింది 'ఏం కావాలి ?' అడిగింది.

'సుల్తాను మాకిచ్చిన మాట తప్పాడు. ఈరోజు రాత్రి పెళ్ళికొడుకుని, పెళ్ళికూతురిని ఇక్కడకు తీసుకురా!' అన్నాడు. 'చిత్తం!' అంటూ మాయమయ్యింది భూతం

[ 30వ పేజీ చూడండి ]

# అల్లావుద్దీన్ అద్భుత దీపం!

రాత్రి సమయంలో వజీరు కొడుకుని, రాజకుమార్తెను, వారి మంచాలతోసహా తీసుకొచ్చి అల్లావుద్దీను ముందు ప్రత్యక్షమయింది భూతం.

'ఈ పెళ్ళికొడుకుని మంచంతోసహా బయట చల్లగాలిలో పడుకోబెట్టు' అన్నాడు. భూతం అలాగే చేసి మాయమయ్యింది.

రాజకుమారి మేలుకుంది. అల్లావుద్దీనును చూసి భయపడింది. 'భయపడకు! నువ్వు నా భార్యవు. నీ తండ్రి నా తల్లికి అలా వాగ్దానం చేశాడు' అన్నాడు. రాజకుమారి భయంచేత మాట్లాడలేదు. అల్లావుద్దీను ఆమె మంచం ప్రక్కన పడుకుని నిద్రపోయాడు.

తెల్లవారిన తర్వాత భూతాన్ని పిలిచాడు. 'మళ్ళీ పెళ్ళికొడుకుని, పెళ్ళికూతురిని వెనక్కి తీసుకువెళ్ళు!' అన్నాడు.

సుల్తాను రాజకుమారిని పలకరించడానికి ఆమె గదిలోకి వెళ్ళాడు. భయంతో వణికిపోతూ కనిపించింది కూతురు. 'ఏమయింది ?' అడిగాడు సుల్తాను కానీ భూతం మనసులోకి రాగానే భయంతో ఒక్కవిషయంకూడా చెప్పలేకపోయింది రాజకుమారి.

మరునాడు కూడా అల్లావుద్దీను పెళ్ళికొడుకుని, పెళ్ళికూతురిని తన దగ్గరకు భూతం ద్వారా రప్పించుకున్నాడు వారిద్దరూ భూతాన్ని చూసి వణికిపోయారు. తెల్లవారిన తర్వాత వారి వారి మందిరాలకు చేర్చబడ్డారు. సుల్తాను కూతురిని ఏమయిందని అడిగాడు 'వజీరు కొడుకుని చేసుకుంటే నా ప్రాణాలు దక్కవు' అని చెప్పింది. సుల్తాను వజీరు కొడుకుని పిలిపించాడు. 'మీ కూతుర్ని చేసుకుంటే ఆ భూతం నన్ను మింగుతుంది. నేను చేసుకోను, నన్ను వదిలేయండి!' అని వేడుకున్నాడు వజీరు కొడుకు. ఆవిధంగా వాళ్ళ పెళ్ళి తప్పిపోయింది

మూడునెలలు గడిచాయి. అల్లావుద్దీను తల్లి సుల్తాన్ను కలిసింది కానీ ఆమె బీదవాలకం చూసి తన కూతుర్ని ఇవ్వదలుచుకోలేదు. వజీరును సలహా అడిగాడు సుల్తాను. 'ఆమె ఇవ్వలేనంత బహుమతి అడగండి!' అన్నాడు వజీరు

సుల్తాను అల్లావుద్దీను తల్లితో 'నీ కుమారుడు నలభై పళ్ళాల నగలను, నలభై మంది నల్లబానిసలతో నాకు బహుమతిగా పంపితే, అప్పుడు నా మాట నిలబెట్టుకుంటాను!' అని ఆమెను పంపివేశాడు.

తల్లి నిరాశగా ఇంటికి చేరి అల్లావుద్దీనుతో చెప్పింది 'ఇంతేకదా! ఇంతకంటే రెట్టింపు బహుమతి పంపుతాను' అన్నాడు. భూతాన్ని పిలిచాడు. ఎనభై మంది నల్లబానిసలతో ఎనభై బంగారు పళ్ళాలను నగలుతో నింపి తల్లిని ఇచ్చి పంపాడు. వీధుల్లో జనం, బానిసలవంక, వాళ్ళు ధరించిన విలువైన దుస్తులవంకా విరగబడి చూసారు తల్లి సుల్తానును కలిసి బహుమతి

[23వ పేజీ తరువాయి]

ఇచ్చింది సుల్తాను చాలా సంతోషించాడు 'నీ కుమారుని నేను ఆహ్వానిస్తున్నానని చెప్పు' అన్నాడు సుల్తాను.

తల్లి కొడుకుతో ఎంతో సంతోషంగా సుల్తాను చెప్పిన విషయం చెప్పింది. అల్లావుద్దీను



భూతాన్ని పిలిచి 'నేను పన్నీటిలో స్నానం చెయ్యాలి. అద్భుతమైన అల్లికలతో కూడిన దుస్తులు కావాలి. సుల్తాను దగ్గర లేనటువంటి గొప్ప గుర్రం, ఇరవైమంది బానిసలు కావాలి నా తల్లిని కనిపెట్టివుండేటందుకు మరొక అందమైన ఆరుగురు బానిసలు కావా మరొక ముఖ్యవిషయం పదివేల బంగారునాణాలతో నింపిన మూట కావాలి. ఈ ఏర్పాట్లు అన్ని చూడు' అన్నాడు భూతం అన్నీ ఏర్పాట్లు చేసింది. అల్లావుద్దీను గుర్రం ఎక్కాడు ఇరవైమంది బానిసలు వీధుల్లో బంగారునాణాలు వెదజల్లుతూ అల్లావుద్దీను వెంట నడిచారు.

అల్లావుద్దీనును చూడగానే సుల్తాను సింహాసనం దిగి పరుగెత్తుకుంటూ వచ్చి కౌగలించుకున్నాడు. ఆరోజు రాత్రే తన కూతురిని అల్లావుద్దీను కిచ్చి పెళ్ళి చేస్తానన్నాడు. కానీ అల్లావుద్దీను నిరాకరించాడు 'ముందు నేనొక సుందరభవనం ఆమెకోసం నిర్మించదలచాను తర్వాత పెళ్ళి విషయం మాట్లాడదాం' అంటూ వెళ్ళిపోయాడ ఈసారి సుల్తాను నిరాశపడ్డాడు

ఇంటికి చేరుకోగానే అల్లావుద్దీను భూతాన్ని పిలిచాడు. 'విలువరాతితో ఒక అందమైన భవనం నిర్మించు. సూర్యకాంతం మొదలగు విలువైన రాళ్ళు భవనం అంతటా పొదగాలి భవనం మధ్యలో ఒక గోపురం ఆకారం రావాలి ఆ గోపురానికి నాలుగువైపులా నాలుగు కిటికీలు వుండాలి మూడు కిటికీలు బంగారంలోనూ, వెండితోనూ చెయ్యాలి కిటికీ తలుపులు వజ్రవైఢూర్యాలతోను, కెంపులతోనూ నింపాలి నాలుగో కిటికీ మాత్రం మామూలుగా వుండాలి. బలంగా అందంగా వుండే గుర్రాలు, గుర్రపుశాల, వాటిని చూడడానికి బానిసలు వుండాలి. వెంటనే ఈ ఏర్పాట్లు చెయ్యి' అన్నాడు.

మరునాటికల్లా అల్లావుద్దీను కోరినవిధంగా భవనం తయారుచేసింది భూతం. అల్లావుద్దీను కొత్త భవనం నుండి సుల్తాను సింహాసనం వరకు అందమైన తివాచీ పరిచింది భూతం. అల్లావుద్దీను తల్లి మంచి దుస్తులు ధరించి, ఎంతోమంది బానిసలు వెంట రాగా సుల్తాను దగ్గరికి వెళ్ళింది. సుల్తాను తన కూతురిని ఇచ్చి ఆమె వెంట పెద్ద వూరేగింపుగా పంపించాడు రాజకుమారిని చూసి అల్లావుద్దీను 'నీ అందాన్ని చూసి నేను ఇదంతా చేస్తున్నాను. నీకు నేను ఇష్టంలేకపోతే చెప్పు' అన్నాడు.

'భూతం అంటే భయం తప్ప నువ్వంటే నాకెంతో ఇష్టం!' అంది రాజకుమారి.

వారిద్దరి పెళ్ళి వైభవంగా జరిగింది. మరునాడు అల్లావుద్దీను సుల్తానును తను నిర్మించిన కొత్త భవనం చూడవలసిందిగా ఆహ్వానించాడు సుల్తాను విలువరాతితోను, సూర్యకాంతులతోనూ, వజ్రవైఢూర్యాలతోనూ, కెంపులతోనూ కట్టబడిన ఆ భవనాన్ని చూసి 'ప్రపంచంలో ఇది ఒక వింతగొలిపే భవనం. కానీ ఒక కిటికీ మాత్రం చాలా మామూలుగా కనిపిస్తున్నది, ఎందువల్ల ?' అడిగాడు.

'ఒక కారణం వుంది. ఆ కిటికీని మిగతా కిటికీల మాదిరిగా మీరు తయారు చేయించండి !' అన్నాడు అల్లావుద్దీను. సుల్తాను అలాగే అన్నాడు. నగరంలో వుండే రత్నాల వ్యాపారులందర్నీ రావించాడు. ఆ కిటికీకి కావలసిన వజ్రవైఢూర్యాలు, రత్నాలు కావాలన్నాడు. 'ఆ కిటికీకి కావలసినన్ని మాదగ్గర లేవు' అన్నారు వాళ్ళు సుల్తాను తన రాజమందిరం నుండి వజ్రాలు, వైఢూర్యాలు, రత్నాలు తెప్పించాడు. ఎన్ని తెప్పించినా కిటికీ పని సగం కూడా పూర్తి చేయించలేకపోయాడు సుల్తాను 'ఇక నావల్లకాదు' అని ఒప్పుకున్నాడు సుల్తాను అల్లావుద్దీను సుల్తాను చేయించిన సగం కిటికీ తీయించి, ఆయనకే ఇచ్చివేశాడు. భూతాన్ని పిలిచి మిగతా మూడు కిటికీల మాదిరిగా ఆ నాలుగో కిటికీను కూడా తయారు చెయ్యమన్నాడు. భూతం అలాగే చేసింది సుల్తాను అల్లావుద్దీనును కౌగలించుకుని 'ప్రపంచంలో నువ్వే భాగ్యశాలివి' అన్నాడు 'ఇదంతా మాయ!' అన్నాడు వజీరు సుల్తానుతో అల్లావుద్దీను మీద అతనికి ఎంతో కోపం

అల్లావుద్దీను పేరు ప్రజల్లో మారు మ్రోగింది. అతనంటే అందరికీ భక్తీ గౌరవం ఏర్పడ్డాయి అతని కీర్తి దేశ దేశాలకు పాకింది.

ఆఫ్రికా మాంత్రికుడి చెవిన అల్లావుద్దీన్ పేరు పడింది 'ఒక పేద దర్జీ కొడుకు యింత గొప్పవాడయ్యాడంటే, కారణం అతను దీపంతో సహా బయటకు వచ్చివుండాలి. ఇక అతడి పని పట్టాలి' అనుకుంటూ రాత్రింబగళ్ళు ప్రయాణంచేసి అల్లావుద్దీను వున్న దేశం చేరుకున్నాడు.

ఆవూరి ప్రజలంతా అల్లావుద్దీను నిర్మించిన సుందర భవనం గూర్చి చెప్పుకోసాగారు. మాంత్రికుడు ఒకడ్ని ఆ భవనం ఎక్కడవుందో దారి చూపించమని అడిగాడు. తర్వాత భవనం దగ్గరికి చేరాడు ధగధగ మెరిసిపోతున్న ఆ భవనాన్ని చూసేసరికి మాంత్రికుడికి సగం పిచ్చియెక్కింది కోపంతో పళ్ళు పటపట కొరికాడు. 'ఇదంతా అద్భుతదీపంవల్ల సాధించాడు ఆ దీపాన్ని చేజిక్కించుకుని మళ్ళీ వాడ్ని దరిద్రుడ్ని చేస్తాను' అనుకున్నాడు.


ఆ సమయంలో అల్లావుద్దీన్ వేటకు వెళ్ళాడు. వారంరోజుల తర్వాతగానీ తిరిగిరాడు మాంత్రికుడు ఇదే మంచి సమయం అనుకున్నాడు కొన్ని రాగితో చేసిన దీపాలు బుట్టలో పెట్టుకుని 'పాత దీపాలిస్తే కొత్త దీపాలిస్తాను' అంటూ అరుస్తూ అల్లావుద్దీను భవనంవేపు వెళ్ళాడు చాలా వింతగా వుంది ఇది అనుకుంటూ జనం అతని వెంబడిపడ్డారు. వీధి అంతా కోలాహలంగా తయారయింది. అల్లావుద్దీను భార్య భవనంలో నుండి ఈ కోలాహలం చూసి సంగతి కనుక్కొని రమ్మని ఒక బానిసను పంపింది. బానిస వెళ్ళి తిరిగివచ్చాడు. 'ఎవరో పిచ్చివాడు. పాత దీపాలు ఇస్తే కొత్త దీపాలు ఇస్తానంటున్నాడు' అన్నాడు 'నిజంగానే పిచ్చివాడే. సరే ఈ పాత దీపం ఇచ్చి కొత్తది తీసుకురా' అంది అల్లావుద్దీను భార్య, అద్భుత దీపాన్ని బానిస చేతికి ఇస్తూ. ఆమెకు దాని గురించి తెలియదు.

బానిస అద్భుత దీపాన్ని మాంత్రికుడి చేతికి ఇచ్చాడు. మాంత్రికుడు దాన్ని ఆత్రుతగా లాక్కొని, కొత్త దీపం ఇచ్చి పంపేశాడు. ఇక వెంటనే వ్యాపారం మాని నగరం చివరకు గబగబా వెళ్ళిపోయాడు. అప్పటికి రాత్రివేళ అయింది మాంత్రికుడు అద్భుత దీపాన్ని రుద్దాడు. భూతం ప్రత్యక్షమయింది

'అల్లావుద్దీను భవనాన్ని, అందులోని రాజకుమారితోనూ, నన్నూ ఆఫ్రికాలో జనసంచారం లేని ప్రదేశానికి చేర్చు!' అన్నాడు

భూతం అలాగే చేసింది.

మరునాడు సుల్తాను తన భవనం కిటికీ గుండా అల్లావుద్దీను భవనం చూద్దామని చూసాడు. అక్కడ భవనం లేదు. కళ్ళు నులుము కున్నాడు. కంగారుగా వజీరును పిలిపించాడు 'ఇదంతా మాయ అని నేను ముందే చెప్పానుకదా!' అన్నాడు వజీరు. సుల్తానుకు కోపంవచ్చి వేటలో వున్న అల్లావుద్దీనును గొలుసులతో బంధించి తీసుకురమ్మని భటులను పంపాడు. వారు



అల్లావుద్దీనును బంధించి తీసుకువచ్చారు. ఈ విషయం ప్రజలకు తెలిసింది. వారందరికి అల్లావుద్దీను అంటే చాలా ప్రేమ అందుచేత భటులవల్ల ఎటువంటి హాని కలగకుండా చూసారు 'అల్లావుద్దీను తల నరకండి' అంటూ ఆజ్ఞాపించాడు సుల్తాను. జనంలో అరుపులు మొదలయ్యాయి. అందరూ తోసుకుంటూ సుల్తానువేపు వచ్చారు సుల్తాను గత్యంతరంలేక అల్లావుద్దీనును విడిచిపెట్టమని చెప్పాడు.

'అసలు నేను చేసిన నేరం ఏమిటి?' అడిగాడు అల్లావుద్దీను

'ఎంత అమాయకంగా మాట్లాడుతున్నావు? ఏదీ నీ భవనం? ఏదీ నా కూతురు?' గర్జించి అడిగాడు అల్లావుద్దీను ఆశ్చర్యంగా తన భవనంకోసం చూసాడు అది అక్కడ వుంటేకదా!

'నీ భవనం సంగతి నాకొద్దు. ముందు నా కూతురిని తెచ్చిచూపించు. లేకపోతే నీ తల ఎగిరిపోతుంది!' అన్నాడు సుల్తాను.

'నాకు నలభై రోజుల గడువు ఇప్పించండి. ఈలోపు నేను మీ కూతుర్ని తీసుకుని రాలేకపోతే నా తల నరికేయండి' అన్నాడు అల్లావుద్దీను. సుల్తాను ఒప్పుకున్నాడు.

అల్లావుద్దీను నాలుగైదురోజులు పిచ్చివాడిలా నగరం అంతా తిరిగాడు. నా భవనం ఏది? అని అందర్నీ అడిగాడు చివరకు ఆత్మహత్య చేసుకోడానికి ఒక నది దగ్గరకు వెళ్ళాడు మోకాళ్ళమీద కూర్చుని చేతులు నలుపుకుంటూ దేవుడ్ని ప్రార్థించాడు అప్పుడు అతని చేతికి వున్న వుంగరానికి రాపిడి తగిలి భూతం ప్రత్యక్షమయింది.

'ఓ భూతమా నన్ను కాపాడు నా భవనం ఎక్కడుందో తెలిపిపెట్టు' అన్నాడు.

'అంత శక్తి నాకు లేదు. నేను నీ ఉంగరానికి బానిసను. ఆ పని దీపంయొక్క బానిస చెయ్యాల్సిందే' అంది.

'అయితే నన్ను ఆ భవనం ఎక్కడుందో అక్కడికి తీసుకెళ్ళు! నా భార్య వున్న గదికి చేర్చు!' అన్నాడు. భూతం అలాగే చేసింది. భార్య అల్లావుద్దీన్ను చూసి సంతోషంతో కౌగిలించు కుంది. 'మన మందిరంలో ఒక పాత దీపం వుండాలి. ఎక్కడ వుంది?' అని అడిగాడు.

'ఆ దీపమా! అది ఇచ్చేసి ఒక కొత్త దీపాన్ని తీసుకున్నాను' అంది

'మన కష్టాలకు అది పోవడమే కారణం' అన్నాడు.

'ఆ మాంత్రికుడు రోజూ నా గదికి వస్తాడు. అల్లావుద్దీన్ను విడిచి నన్ను పెళ్ళి చేసుకో అని అడుగుతున్నాడు. నన్ను రక్షించు!' అంది

'ఆ దీపం ఎక్కడ వుంది?' అడిగాడు అల్లావుద్దీను 'మాంత్రికుడు ఎప్పుడూ దాన్ని తనదగ్గరే వుంచుకుంటాడు' అంది.

'నేను మళ్ళీ వస్తాను' అంటూ అల్లావుద్దీను నగరంలోకి వెళ్ళాడు తనకు కావలసిన పొడి కొన్నాడు. మళ్ళీ భవనానికి తిరిగివచ్చాడు

'అందమైన దుస్తులు ధరించి మాంత్రికుడ్ని ఆకర్షించు నువ్వు చెప్పినట్టు వింటాడు. వాడు తాగే సారాయిలో ఈ పొడి కలుపు!' అన్నాడు అల్లావుద్దీను తన భార్యతో. తర్వాత భవనంలో ఒకచోట దాక్కున్నాడు.

ఆమె అందమైన దుస్తులు ధరించింది నగలు పెట్టుకుంది. అతి సుందరంగా ముస్తాబు అయింది. మాంత్రికుడు గదిలోపలికి వచ్చాడు. రాజకుమారిని చూసి ఆశ్చర్యపోయాడు. ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

'నేను నిన్నే పెళ్ళాడ్డానికి నిర్ణయించు కున్నాను. అల్లావుద్దీనుకోసం ఎంత కాలం ఎదురు చూడను. నా తండ్రి అతనికి శిక్ష విధించి వుంటాడు. ఈ పూట ఇక్కడే విందు ఏర్పాటు చేస్తాను' అంది మాంత్రికుడు సంతోషంగా ఒప్పుకున్నాడు.

విందుకు ముందు సారాయి తాగాడు మాంత్రికుడు. అందులో అల్లావుద్దీను ఇచ్చిన పొడివేసి ఉంచింది అతని భార్య. మాంత్రికుడు ఆ సారాయి తాగి దభీమని క్రిందపడి వచ్చాడు. అల్లావుద్దీను భార్య పరుగు పరుగున గదిలోంచి బయటకు వచ్చింది సమయంకోసం ఎదురు చూస్తున్న అల్లావుద్దీను గదిలోకి వచ్చాడు. మాంత్రికుడు బట్టలు తడిమి, అతని జేబులో వున్న అద్భుతదీపాన్ని తీసుకున్నాడు. భూతాన్ని పిలిచాడు. 'మమ్మల్ని భవనంతోసహా మా నగరానికి చేర్చు' అన్నాడు.

సుల్తాను, అల్లావుద్దీను భవనం మళ్ళీ అదే ప్రదేశంలో ప్రత్యక్షమవడం చూసి సంతోషించాడు. అల్లావుద్దీను తన భార్యను తీసుకువెళ్ళి సుల్తానుకు చూపించాడు. అల్లావుద్దీన్ను సుల్తాను కౌగలించు కున్నాడు.

తర్వాత ఎటువంటి కష్టాలు లేకుండా అల్లావుద్దీను భార్యతో ఆనందంగా కాలం గడిపాడు. సుల్తానుకు వారసుడుగా రాజ్యానికి వచ్చి ఎన్నో ఏళ్ళు ప్రజానురంజకంగా పాలించాడు.

(అరేబియన్ నైట్స్ కథ ఆధారంగా)

— బాపు

